
సాక్షి
ఖమ్మం
శనివారం । 24 । ఆగస్టు । 2024



రగులుతున్న భూవివాదం

సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలోని గిరిజన సొసైటీకి సంబంధించి భూవివాదం రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తోంది. 8లో



జీఓ 28పై నిరసనలు

నూతన పింఛన్ విధానం అమలుకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 28 ప్రతులను సీపీఎస్ ఉద్యోగులు దహనం చేసి నిరసన తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం ఉదయం ఎండ తక్కువగానే ఉంటుంది. మధ్యాహ్నానికి మాత్రం ఉష్ణోగ్రత గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

మెడికల్ కాలేజీ పనులు త్వరగా ప్రారంభించాలి

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రితో తుమ్మల భేటీ



వైద్య ఆరోగ్య మంత్రితో తుమ్మల, తదితరులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీకి స్థలం కేటాయించిన నేపథ్యాన నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో భేటీ అయిన తుమ్మల మాట్లాడుతూ పనులు మొదలుపెట్టి త్వరగా పూర్తిచేస్తే వచ్చే విద్యాసంవత్సరానికి అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అలాగే, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యాన వైద్యులు, నర్సులను పూర్తిస్థాయిలో నియమించి పీహెచ్‌సీలను బలోపేతం చేయాలని కోరారు. మంత్రి వెంట ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు ఉన్నారు.

18నుంచి డీఈఐఈడీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఐఈడీ) 2022–24వ బ్యాచ్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సెప్టెంబర్ 18నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ ఈ.సోమశేఖరశర్మ తెలిపారు. పరీక్షలు నిర్ణీత తేదీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www. bse. telangana. gov. in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

విధుల్లో చేరిన జిల్లా సహకార అధికారి



గంగాధర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లా సహకార అధికారిగా జి.గంగాధర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల చేపట్టిన బదిలీల్లో రెరా(రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ) జాయింట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆయనను ఖమ్మం సహకార అధికారిగా కేటాయించిన విషయం విదితమే. ఈమేరక బాధ్యతలు స్వీకరించిన గంగాధర్‌ను అధికారులు, ఉద్యోగులు సీహెచ్.రవి, కె.సందీప్, జి.ఉషశ్రీ, ఎంఎస్.మురళి, ఎండీ.అన్వర్, కె.శ్రీదేవి, ఎస్‌కే.మౌలానా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

చేపల సీడ్ ఫామ్స్ పరిశీలన

ఖమ్మంవ్యవసాయం: చెరువుల్లో వదిలేందుకుగాను చేపపిల్లల కొనుగోలు ప్రక్రియలో భాగంగా అధికారుల బృందం సీడ్ ఫామ్స్‌ను పరిశీలించింది. టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్ల సీడ్ ఫామ్స్‌ను మత్స్యశాఖ, పశుసంవర్ధక, పశువైద్య శాఖకు చెందిన ముగ్గురు అధికారులతో కూడిన బృందం గురు, శుక్రవారాల్లో పరిశీలన చేపట్టింది. ఈ బృందంలో మత్స్యశాఖ జిల్లా అధికారి రాజనర్సయ్య, సత్తుపల్లికి చెందిన అధికారి నరేష్, పశుసంవర్ధక, పశువైద్య శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు ఉండగా.. మచిలీపట్నం, నేలకొండపల్లి నాచేపల్లి ఫామ్‌లను పరిశీలించి పంపిణీకి అవసరమైన చేప పిల్లల లభ్యత ఉందా, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఈ మేరకు నివేదికను ఉన్నతాధికారులకు పంపించనుండగా అనుమతి లభిస్తే చేప పిల్లలు కొనుగోలు చేయనున్నారు. కాగా, జిల్లాలో 896 జలాశయాల్లో 3.50 కోట్ల చేపపిల్లలకు వదలాలని ఇప్పటికే నిర్ణయించారు.

జీడీఎస్‌లుగా 139 మంది ఎంపిక

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన గ్రామీణ డాక్ సేవక్స్(జీడీఎస్) నియామక ప్రక్రియలో ఖమ్మం తపాలా డివిజన్ నుంచి 139 మంది ఎంపికయ్యారు. తపాలా శాఖ సేవలను గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు విస్తృతపరిచేందుకు 2024 జూలైలో దేశవ్యాప్తంగా గ్రామీణ డాక్ సేవక్‌ల నియామకానికి నిర్ణయించారు. పదో తరగతి అర్హతగా దరఖాస్తులు స్వీకరించగా తెలంగాణ తపాలా సర్కిల్ పరిధిలో 980 మంది జీడీఎస్‌లుగా ఎంపికయ్యారు. ఇందులో ఖమ్మం తపాలా డివిజన్ నుంచి 139 మంది ఉన్నారని, త్వరలోనే వీరి ఒరిజినల్ సర్టిఫికెట్లను పరిశీలించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. అనంతరం అర్హత సాధించిన జీడీఎస్‌లకు 15రోజుల పాటు శిక్షణ ఇచ్చి బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్టుమాస్టర్లుగా నియమిస్తారు.

మనమూ స్మార్ట్ రేసులో..



ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ స్మార్ట్‌సిటీగా అర్హత సాధించే దిశగా అడుగులు పడుతున్నాయి. విస్తీర్ణం, జనాభా, ఇతర మౌలిక వసతుల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. డీపీఆర్ రూపకల్పన కోసం సర్వే బాధ్యతలను ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. గతంలో గ్రేటర్ హైదరాబాద్, వరంగల్ గ్రేటర్ కార్పొరేషన్లు స్మార్ట్‌సిటీకి ఎంపిక కాగా.. ఇటీవల కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను సైతం ప్రతిపాదించడంతో ఎంపికైంది. ఫలితంగా ఆయా నగరాల్లో స్మార్ట్‌సిటీ కింద కేంద్రం నుంచి వచ్చే నిధులకు తోడు రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయిస్తుండడంతో అభివృద్ధి పనులు, పలు ప్రాజెక్టుల పనులు మొదలయ్యాయి. ఈనేపథ్యాన ఖమ్మంను కూడా రేసులో నిలిపేలా ప్రయత్నాలు ప్రారంభించారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ఖమ్మంను జాబితాలో నిలిపేలా అధికారుల కసరత్తు

- వనరులు, అవకాశాలపై ప్రైవేట్ ఏజెన్సీతో సర్వే?
- నివేదిక ఆధారంగా పోటీకి వెళ్లాలని నిర్ణయం
- అన్ని హంగులు ఉన్నందున స్థానం ఖాయమని ధీమా

భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని..

నగరీకరణ పెరుగుతుండడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి ఖమ్మంకు వచ్చి స్థిరపడుతున్న వారి సంఖ్య ఎక్కువవుతోంది. దీంతో నలుమూలల కొత్త కాలనీలు వెలుస్తున్నాయి.భవిష్యత్తులో ఇది మరింత పెరిగే అవకాశముంది. ఈనేపథ్యాన రాబోయే మూడు దశాబ్దాల్లో జనాభాకు అనుగుణంగా నగరాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, వనరుల కల్పన, సామాజిక, ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ స్మార్ట్‌సిటీ మిషన్‌ను 2015 ఏడాదిలో ప్రారంభించింది. విద్యుత్, నీరు, రవాణా, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, సేవలను ప్రజలకు అందించడం.. తద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచడం, సుస్థిరమైన వాతావరణాన్ని మెరుగుపర్చడం, నియంత్రించడమే కాక అమలు చేయడానికి వీలుగా ఈ పథకం మొదలైంది. తద్వారా నగరాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడితే మరింత మంది ఇక్కడ నివసించడానికి ఇష్టపడతారని... ఆపై పారిశ్రామికంగా పెట్టుబడులు ఆకర్షించొచ్చనేది ఈ ప్రాజెక్టు ఉద్దేశం.

ఆ మూడింటి తర్వాత..

దేశవ్యాప్తంగా వంద నగరాలు స్మార్ట్‌సిటీలుగా ఎంపికయ్యాయి. రాష్ట్రం నుంచి గ్రేటర్ హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌కుస్థానం దక్కగా.. అదేస్థాయిలో అభివృద్ధి చెందుతున్న నగరంగా ఖమ్మం కార్పొరేషన్‌కు పేరు ఉంది. ఈ నేపథ్యాన ఖమ్మం కార్పొరేషన్‌ను సైతం స్మార్ట్‌సిటీ పోటీలో నిలిపేలా అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్మార్ట్ సిటీకి కావాల్సిన అర్హతలు.. ప్రస్తుతం ఇక్కడ ఉన్న సదుపాయాలు.. ఇంకా ఏం చేస్తే పోటీలో నిలవగలమనే అంశంపై సర్వే చేసే బాధ్యతను ఓ ప్రైవేట్ కన్సల్టెంట్ ఏజెన్సీకి అప్పగించనున్నట్లు సమాచారం. సదరు సంస్థ సమర్పించే డీపీఆర్ ఆధారంగా ముందుకు సాగుతారని తెలుస్తోంది.

రెండు దశలు దాటితేనే..

ఖమ్మం స్మార్ట్‌సిటీగా ఎంపిక కావాలంటే సాంకేతికతపై ఆధారపడిన మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన ప్రజారవాణా, నమ్మకమైన, ప్రగతిశీలమైన ప్రణాళికలు అవసరం. స్మార్ట్‌సిటీ కోసం మొదట రాష్ట్రస్థాయిలో పోటీ పడాల్సి ఉంటుంది. ఇక్కడ అర్హత సాధిస్తే జాతీయ స్థాయిలో స్మార్ట్ సిటీస్ చాలెంజ్ ఆధారంగా ఎంపిక ఉంటుంది. అక్కడ కూడా అర్హత సాధిస్తే స్మార్ట్ సిటీగా ఎంపికైతే ఐదేళ్ల పాటు మిషన్ అమలు బాధ్యతను కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ స్వీకరిస్తుంది. అభివృద్ధి పనులకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందజేయనుండగా.. అందుకు సమానమైన మ్యాచింగ్ గ్రాంట్‌ను రాష్ట్రం, పురపాలక వ్యవస్థలు చెల్లించాలి.

ఏమేం చేస్తారు?

స్మార్ట్ సిటీగా ఎంపికైతే ప్రజారవాణా వ్యవస్థకు మెరుగయ్యేలా రహదారులు నిర్మిస్తారు. అలాగే, పాదచారుల కోసం ఫుట్‌పాత్‌లు, పర్యాటక స్థలాలు, పార్క్‌ల అభివృద్ధి ఇతరత్రా పనులు చేపడుతారు. అంతేకాక నగర రూపురేఖలు మారేలా ఆర్చీలు, సూచిక బోర్డులు ఏర్పాటుచేస్తారు. ఇలా దశల వారీగా అభివృద్ధి చేయనుండడంతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని.. ఫలితంగా పెట్టుబడులను ఆకర్షించే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు.

సాంకేతికత ఆధారంగా..

ఇటీవల సమాచార సాంకేతిక పరిజ్ఞానం పురోగతితో పట్టణ నిర్వహణ దాదాపు అన్ని శాఖలను ఏకీకృతం, సమన్వయం చేస్తోంది. సాంకేతికత సాయంతో పౌరులకు స్నేహపూర్వక, జవాబుదారీ, పారదర్శక, తక్కువ ఖర్చుతో పరిపాలనను అందుతోంది. ఆపై కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపర్చడం, ప్రజలతో సమాచారాన్ని పంచుకోవడం, ప్రభుత్వ సేవ, పౌర సంక్షేమానికి మెరుగైన నాణ్యతతో అందించేందుకు స్మార్ట్ సిటీ ప్రాజెక్టులోనూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా అన్ని అంశాలను విశ్లేషిస్తూ పౌరుల జీవన నాణ్యతను మెరుగుపర్చడంతో పాటు ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం స్మార్ట్‌సిటీ ప్రధాన లక్ష్యం. భవిష్యత్‌లో పెరిగే జనాభా, అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాంకేతికంగా అభివృద్ధి చేయడం కూడా ఇందులో భాగమే.

ఖమ్మం నగర విస్తీర్ణం	డివిజన్లు	రెవెన్యూ వార్డులు	నివాస, వాణిజ్య భవనాలు	జనాభా	పర్యాటక ప్రాంతాలు
94.37 చదరపు కిలోమీటర్లు	60	20	83 వేలకు పైగా	సుమారు 4 లక్షలు	ఖిల్లా, లకారం ట్యాంక్‌బండ్, స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయం

పశుగణన పకడ్బందీగా చేపట్టాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో పశు గణనను పకడ్బందీగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. 21వ జాతీయ పశు గణన సందర్భంగా కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 1నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు 589 జీపీలు, నాలుగు పట్టణ ప్రాంతాలు కలిపి మొత్తం 999 ఆవాసాల్లో సమగ్రంగా గణన పూర్తి చేయాలన్నారు. ఇందుకోసం 150 మంది ఎన్యుమరేటర్లు, 40 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. అనంతరం జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ బి.వేణుమనోహరరావు మాట్లాడగా అధికారులు రాధాకిషన్, శ్రీరమణి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ధరణి దరఖాస్తులు పరిష్కరించండి

మధిర: భూసమస్యలకు సంబంధించి ధరణి ద్వారా అందిన పెండింగ్ దరఖాస్తులన్నీ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ సూచించారు. మధిర తహసీల్‌లో ఆయన ధరణి దరఖాస్తులు, ప్రజావాణి అర్జీల పరిష్కారం, ఓటరు జాబితా సవరణపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ధరణితో పాటు ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఆతర్వాత మధిర వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఎంపీడీఓలు, ఎంపీఓలతో సమావేశమైన అదనపు కలెక్టర్ సీజనల్ జ్వరాల నేపథ్యాన పారిశుద్ధ్య నిర్వహణపై సూచనలు చేశారు. నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవడంతో పాటు డ్రెయినేజీలు, ఖాళీ ప్లాట్లతో పిచ్చి మొక్కలను తీయించాలని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి సుబ్బారావు



ఏన్కూరులో జ్వరంతో బాధపడుతున్న వ్యక్తి చికిత్సపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ సుబ్బారావు

తల్లాడ/ఏన్కూరు: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతున్నందున ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వ్యయ ప్రయాసలకు గురికావొద్దని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి వి.సుబ్బారావు సూచించారు. తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అన్నారుగూడెంలో వైద్య శిబిరంతో పాటు ఏన్కూరు పీహెచ్‌సీని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్న వారితో ఆయన మాట్లాడారు. డెంగీ, మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు సోకిన వారు సకాలంలో వైద్యం చేయించుకుంటే ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలిపారు. జ్వరం సోకిన వెంటనే ప్రభుత్వాస్పత్రిలో పరీక్షలు చేయించుకుంటే నిర్ధారణ చేసి చికిత్స ఇస్తారని చెప్పారు. దీనికి తోడు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం వైద్యులు, సిబ్బందికి పరీక్షలు, వైద్యశిబిరాల నిర్వహణపై సూచనలు చేశారు. వైద్యులు రత్నమనోహర్, నీష్మ, గోపి, బి.రాములు, మౌనిక, సాయిలాస్యతో పాటు ఉద్యోగులు భాస్కర్, పెద్ద పుల్లయ్య, కమల, భద్రమ్మ, విజయలక్ష్మి, సురేష్, శివరాజు, దుర్గాప్రసాద్, ఉప్పెర్ల వెంకటరమణ, జి.భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నం ఫౌండేషన్‌కు రూ.10లక్షల విరాళం



విజయభాస్కరాచార్యులు దంపతులను సన్మానిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

ఖమ్మం అర్బన్/సత్తుపల్లి: ఖమ్మంలో మానసిక దివ్యాంగులు, వృద్ధుల కోసం నిర్వహిస్తున్న అన్నం ఫౌండేషన్‌కు సత్తుపల్లికి చెందిన ముదుంబై విజయ భాస్కరాచార్యులు – వకులాదేవి దంపతులు రూ.10లక్షల విరాళం అందజేశారు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడుకు చెందిన ఆయనకు సొంతిల్లు కూడా లేకపోగా ప్రస్తుతం సత్తుపల్లిలో నివసిస్తున్నారు. అయినప్పటికీ తమ సేవలను గుర్తించి రూ.10లక్షల ఎఫ్‌డీ బాండ్ ఇవ్వడంపై ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు శుక్రవారం విజయ భాస్కరాచార్యులు దంపతులను సన్మానించారు.

కొత్తకొత్తగా కమిషనరేట్!

- మారనున్న పోలీసు కమిషనరేట్ రూపురేఖలు
- నూతనంగా మధిర సబ్ డివిజన్, రెండు పీఎస్‌ల ఏర్పాటు
- మిగతా డివిజన్లలో చేర్పులు, మార్పులు
- ప్రతిపాదనలను త్వరలో ఆమోదించే అవకాశం



ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ కమిషనరేట్ రూపురేఖలు మారనున్నాయి. కమిషనర్ పరిధిలో కొత్త కాలనీల ఏర్పాటుతో నానాటికీ విస్తీర్ణం పెరుగుతోంది. దీంతో మార్పులు, చేర్పులకు అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా కొత్తగా మధిర కేంద్రంగా కొత్త సబ్ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అంతేకాకుండా రెండు పోలీసుస్టేషన్లు కూడా ఏర్పాటుచేయాలనే నిర్ణయానికి రాగా.. ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. వీటిపై ప్రభుత్వం సానుకూలంగా ఉన్న నేపథ్యాన త్వరలోనే ఆమోదం లభించే అవకాశముందని తెలిసింది.

ఇకపై పాలేరు సర్కిల్

ఇన్నాళ్లు కూసుమంచి సర్కిల్‌గా కాస్తా పేరు పాలేరు సర్కిల్‌గా మారుతుంది. ఈ సర్కిల్ పరిధిలోకి కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్లు రానున్నాయి.

రెండు పోలీస్‌స్టేషన్లు

జిల్లాలో ప్రస్తుతం ఉన్న పోలీసుస్టేషన్లకు తోడు కొత్తగా రెండు పీఎస్‌లు ఏర్పాటవుతాయి. తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు, ఖమ్మం రూరల్ మండలం మండలం ఎంవీ.పాలెం ఈ జాబితాలో ఉన్నాయి. ఈ రెండు కూడా ఎస్‌హెచ్‌ఓ స్థాయి అధికారి హోదాతో ఏర్పాటవుతాయి.

మార్పుల అనంతరం ఇలా...

మార్పులు, చేర్పుల అనంతరం సబ్ డివిజన్ల వారీగా జాబితాలో ఉండనున్న పోలీసుస్టేషన్ల వివరాలిలా ఉన్నాయి. వైరా సబ్‌డివిజన్‌లోని కొణిజర్ల పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ స్థాయికి అప్‌గ్రేడ్ కానుండగా.. ఖమ్మం రూరల్ పరిధిలో ఉన్న కారేపల్లి, కామేపల్లి పోలీస్‌స్టేషన్లను చేరుస్తారు. అంతేకాక ఏన్కూరు పీఎస్ కూడా ఈ డివిజన్ పరిధిలోకి వస్తుంది. అలాగే, కల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో కల్లూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌ఓ స్థాయికి అప్‌గ్రేడ్ అవుతుంది. దీంతో సహా సత్తుపల్లి, వీఎం బంజర, వేంసూరు, తల్లాడ పీఎస్ సైతం ఈ డివిజన్‌లో ఉంటాయి. ఇక ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్ పీఎస్‌లతో పాటు కొత్తగా ఏర్పాటయ్యే సుబ్లేడు, ఎం.వీ.పాలెం పీఎస్‌లను చేరుస్తారు. ఇంకా ఖమ్మం టౌన్ సబ్ డివిజన్‌లో ఖమ్మం – 1, 2, 3 టౌన్ పీఎస్‌లతో పాటు ఖానాపురం హవేలీ, రఘునాథపాలెం పోలీసుస్టేషన్లు ఉంటాయి.

మధిరలో సబ్‌డివిజన్

జిల్లాలో ఇప్పటివరకు ఖమ్మం, ఖమ్మం రూరల్, వైరా, కల్లూరు పోలీస్ సబ్ డివిజన్లు ఉన్నాయి. అయితే, జిల్లా ఏపీకి సరిహద్దుగా ఉండడం.. జాతీయ రహదారులు వెళ్తుండడంతో రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనలు సర్వసాధారణమయ్యాయి. అంతేకాకుండా ఏపీ, ఒడిశా నుంచి జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు నిందితులు గంజాయి తరలిస్తున్నారు. ఈనేపథ్యాన పర్యవేక్షణ సులువయ్యేలా కొత్తగా మధిర సబ్ డివిజన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. ఇన్నాళ్లు వైరా సబ్‌డివిజన్‌లో ఉన్న మధిర టౌన్, మధిర రూరల్, ఎర్రుపాలెం, బోనకల్, చింతకానితో పాటు ఖమ్మం రూరల్ కింద ఉన్న ముదిగొండ పోలీస్‌స్టేషన్లను ఈ సబ్‌డివిజన్ పరిధిలోకి చేరుస్తారు.

సాఫీగా సాగేలా...



వ్యర్థాలను తొలగిస్తున్న వాహనాలు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం దానవాయిగూడెంలోని డంపింగ్ యార్డ్‌లో చెత్త గుట్టలుగా పేరుకుపోగా లోనకు వెళ్లే మార్గంలో ట్రాక్టర్ల డ్రైవర్లు తరచూ ఆందోళనకు దిగుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో ఇటీవల 'చెత్తగుట్ట.. కదలంట!' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో డంపింగ్ యార్డులో వాహనాలు వెళ్లేందుకువీలుగా వ్యర్థాలను తొలగిస్తున్నారు. ఒక పొక్లెయినర్, రెండు జేసీబీలతో డంపింగ్ యార్డ్‌లో వ్యర్థాలను పక్కకు తరలిస్తుండడంతో కొంత మేర దారి శుభ్రమైందని సిబ్బంది తెలిపారు. మరో రెండు రోజులు పనులు కొనసాగనుండగా.. ఆతర్వాత ట్రాక్టర్లు చివరకు వెళ్లే మార్గం ఏర్పడుతుందని తెలుస్తోంది.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజుల పాటు వరుసగా సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న శనివారం, 25న ఆదివారం వారాంతపు సెలవులు కాగా 26వ తేదీ సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ సందర్భంగా సెలవుగా ఇచ్చినట్లు వెల్లడించారు. రైతులు, వ్యాపారులు, కార్మిక వర్గాలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. కాగా, మంగళవారం నుంచి పంట కొనుగోళ్లు మొదలవుతాయని తెలిపారు.

క్లుప్తంగా

టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు ప్రారంభం


సభ్యత్వం అందచేస్తున్న శ్రీనివాస్, తదితరులు

ఖమ్మం సహకారనగర్: టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు అడ్‌హక్ కమిటీ కోకన్వీనర్ కొణిదన శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎంహెచ్‌ఓ కార్యాలయ సూపరింటెండెంట్ రాజేందర్‌కు మొదటి సభ్యత్వాన్ని అందించగా డీఎంహెచ్‌ఓ, డీసీహెచ్‌ఎస్‌తో పాటు పలు కార్యాలయాల్లో ఉద్యోగులకు సభ్యత్వాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జైపాల్, కొమరగిరి దుర్గాప్రసాద్, శ్రీధర్‌సింగ్, లలిత, గుంటుపల్లి శ్రీనివాస్, సగ్గుర్తి ప్రకాశరావు, పెద్దినేని రామకృష్ణ, తాళ్లూరి శ్రీకాంత్, భద్రం పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ నేతలు ధర్నా చేయడం గర్హనీయం'

ఖమ్మంవన్‌టౌన్: పదేళ్ల పాటు రైతులను అరిగోస పెట్టిన బీఆర్‌ఎస్ నాయకులు ఇప్పుడు రుణమాఫీ పేరిట ధర్నా చేయడం గర్హనీయమని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ధర్నాలు చేసినంత మాత్రాన బీఆర్‌ఎస్‌ను రైతులు నమ్మే పరిస్థితి లేదని తెలిపారు. పదేళ్లుగా రైతుల రుణాలను మాఫీ చేయకపోతే.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మేరకు రూ.2లక్షల మేర రుణాలు మాఫీ చేసిందని వెల్లడించారు. అర్హత ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ వర్తిస్తుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 1,73,329 మంది రైతుల ఖాతాల్లో రూ.1,183కోట్లు జమ అయ్యాయని రాయల వెల్లడించారు. ఏనాడూ రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్‌ఎస్ నేతలు ధర్నా చేయడాన్ని వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు జేవీవీ జిల్లా మహాసభ

ఖమ్మం సహకారనగర్: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా మహాసభను ఈనెల 25న ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు అలవాల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మల శివన్నారాయణ, కె.రామారావు తెలిపారు. నగరంలోని జేవీవీ కార్యాలయంలో శుక్రవారం వారు మాట్లాడుతూ గత మహాసభ నుంచి ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలకు రాష్ట్ర అధ్యక్షులు కోయ వెంకటేశ్వరరావు హాజరవుతారని తెలిపారు.

నర్సరీల నిర్వాహకులు నిబంధనలు అతిక్రమించొద్దు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలోని మిర్చి సాగు చేస్తున్న రైతులు ఎక్కువ మంది నారు కోసం నర్సరీలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యాన నర్సరీల సంఖ్య పెరగగా.. ఉద్యాన శాఖ అధికారులు నిఘా పెంచారు. కల్తీ విత్తనాలతో నారు అంటగడితే రైతులు నష్టపోయే ప్రమాదమున్నందున ఎప్పటికప్పుడు తనిఖీలు చేపడుతున్నట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమాభివృద్ధి అధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. నర్సరీల నిర్వాహకులు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని, నారు పెంచే విత్తనాల రకాలు, కంపెనీల వివరాలను ఎప్పటికప్పుడు సమర్పించాలని, రైతులకు నారు అమ్మే సమయాన బిల్లులు ఇవ్వాలని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమించే వారికి రూ.50 వేల జరిమానా లేదా ఏడాది జైలు శిక్షతో పాటు జ.రిమానా కూడా విధించే అవకాశముందని హెచ్చరించారు.

భారీ వాహనాలు నిషేధం..

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని మున్నేరు వంతెనపై భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు, డీసీఎం, లారీల రాకపోకలను శనివారం నుంచి అనుమతించబోమని ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు జలగం నగర్ సమీపాన హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ బ్రిడ్జి పక్కనే కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలోనే అవాంతరాలు ఎదురుకాకుండా రాకపోకలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

వెంగన్నపేటలో వర్షానికి కూలిన ఇళ్లు

తల్లాడ: మండలంలోని వెంగన్నపేటలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పూరిళ్లు కూలిపోయింది. స్థానికుడైన నందాల నాగేశ్వర్‌రావుకు చెందిన ఇళ్లు కూలుతుండగా ఆయన అప్రమత్తమై బయటపడ్డాడు. ఘటనపై బాధితుడు శుక్రవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	6,800	6,575
మిర్చి	17,100	9,000
మిర్చి తాలు	10,000	8,000
ఏసీ మిర్చి	19,400	10,300
ఏసీ తాలు	11,850	7,000
పత్తి	7,375	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,828

రగులుతున్న భూవివాదం..

- రామగోవిందాపురం గిరిజన సొసైటీలో సభ్యత్వాల ఘర్షణ
- 125 ఎకరాల భూమిపై ఎడతెగని పంచాయితీ


బేతుపల్లి రెవెన్యూలోని గిరిజన సొసైటీ భూములు ఇవే..

సత్తుపల్లి: సత్తుపల్లి మండలం రామగోవిందాపురంలోని ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీకి సంబంధించి బి.గంగారం భూవివాదం రోజురోజుకు పెరుగుతోంది. పరస్పర ఆరోపణలు, వాగ్వాదాలతో ఏ క్షణంలో ఏం జరుగుతుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భూమిపై తమకే హక్కులు ఉన్నాయంటూ గిరిపుత్రులు పరస్పరం ఫిర్యాదులు చేసుకోవడం, భూమిలోకి చొచ్చుకెళ్లే ప్రయత్నాలు చేస్తుండడంతో ఉత్కంఠ నెలకొంది. ఈ ఏడాది ఏప్రిల్‌లో సత్తుపల్లి మండలం చంద్రాయపాలెంలో జరిగిన భూవివాదం తరహాలోనే తీవ్రమవుతుందేమోనని పోలీసులు శాంతియుతంగా పరిష్కరించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. భూమి హక్కులపై జిల్లా సహకార శాఖ అధికారి విచారణ జరిపే వరకు ఎవరూ తొందరపడొద్దని ఇరువర్గాలకు సర్దిచెప్పి ప్రస్తుతానికి శాంతింపచేశారు.

ఐదేళ్లకోసారి ఎన్నికలు

ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీ, బి.గంగారం పేరిట కమిటీని 1989లో ఏర్పాటు చేయగా ఐదేళ్లకోసారి ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అంతేకాక మూడు నెలలకోసారి కార్యవర్గ సమావేశం, ఆరు నెలలకోసారి అధికారుల సమక్షాన మహాజన సభ కొనసాగుతోంది. తొలినాళ్లలో భూమి వదిలేసి వెళ్లిన 32 మంది స్థానంలో ఇతరులను సభ్యులుగా తీసుకుని, మరణించిన వారి స్థానంలో వారి వారసులను నియమిస్తూ 47 మంది సభ్యులతో కమిటీ కొనసాగుతోంది. ప్రస్తుతం భూమి అభివృద్ధి చెందాక సొసైటీకి సంబంధం లేని వ్యక్తులు వాటా కావాలని వివాదాలకు తెరలేపుతున్నారని రామగోవిందాపురం కొమురంభీం ఎస్టీ కాలనీ గిరిజనులు మండిపడుతున్నారు. వీరిలో ఇద్దరు సభ్యులు మినహా ఎవరికీ కనీస వారసత్వం కూడా లేదని తేల్చిచెప్పారు.

స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చారంటూ..

భూ రికార్డులను తమ వద్ద ఉన్నా సభ్యత్వం తొలగించి కొత్త వాళ్లను చేర్చుకోవడం సొసైటీకి నిబంధనలకు విరుద్ధమని గంగారం గట్టుబజార్ గిరిజనులు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో వివాదం తెరపైకి వచ్చింది. గట్టుబజార్ గిరిజన కుటుంబాల నుంచి 16 మంది వారసులు ఉన్నా వారిని భూమిలోకి రానివ్వడం లేదని ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. సొసైటీలోని సభ్యులను తొలగించే అధికారం ఎవరికీ లేకపోగా, స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చారని ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు హక్కులు కల్పించాలంటూ కొన్నాళ్లుగా ఆందోళన చేస్తున్నారు.


గిరిజనులతో చర్చిస్తున్న సీఐ టి.కిరణ్

పట్టాల కోసం పోరాటం

బేతుపల్లి రెవెన్యూ సర్వే నంబర్ 40లో ఎస్సీ సొసైటీ కి చెందిన 50 మంది రైతులకు 125 ఎకరాల భూమి లో 2.5 ఎకరాల చొప్పున వ్యక్తిగతంగా 2006లో పట్టాలు ఇచ్చారు. అదే తరహాలో గిరిజన సొసైటీ భూములకూ పట్టాలు ఇవ్వాలంటూ 15 ఏళ్లుగా గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. అయితే సొసైటీ భూముల్లో సభ్యత్వ వివాదం ఉండడంతో వ్యక్తిగత పట్టాలపై అధికారులు ముందుకు రాలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో సొసైటీ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్ చేయాలని భావించినా అది ముందు కు సాగలేదు. ఇంతలోనే సభ్యత్వ వివాదం మళ్లీ మొదలుకావడంతో అధికారులు సమస్యకు పరిష్కా రం చూపించాలని పలువురు కోరుతున్నారు.

1972 సంవత్సరంలో..

ముఖ్యమంత్రిగా జలగం వెంగళరావు ఉన్నప్పుడు 1972లో 50 మంది గిరిజనులు, మరో 50 మంది ఎస్సీలకు బేతుపల్లి సర్వే నంబర్ 40/1లో 125 ఎకరాల చొప్పున 250 ఎకరాలు భూమి కేటాయించారు. ఇందులో 125 ఎకరాలకు ట్రైబల్ జాయింట్ ఫార్మింగ్ కోఆపరేటివ్ సొసైటీకి అప్పగించారు. ఆనాడు భూమి అడవిని తలపించేలా గొయ్యిలు, ముళ్ల కంపలతో నిండి ఉండగా ఐటీడీఏ సహకారంతో బోరు వేసినా ఫలితం కానరాలేదు. దీంతో 1995లో ఐటీడీఏ డ్రై ల్యాండ్ హార్టికల్చరల్ ప్రోగ్రాం కింద 30 ఎకరాల మామిడి, 30 ఎకరాల్లో జీడిమామిడి, 30 ఎకరాల్లో చిట్రనెల్లా ఆయిల్‌గడ్డి వేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే, సాగునీరు సరిగా అందక ఆశించిన స్థాయిలో మొక్కలు పెరగకపోవడంతో కొందరు భూమిని వదిలేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారు. కానీ భూమిని మాత్రం అభివృద్ధి చేసేలా కొన్నేళ్ల నుంచి లీజ్‌కు ఇస్తున్నారు. ప్రస్తుతం భూమి అభివృద్ధి చెంది ఐదు బోర్లు, విద్యుత్‌లైన్లతో సాగులోకి రాగా జామాయిల్, మొక్కజొన్న, చెరకు పంటలను పండిస్తున్నారు.

వరి పైరులో జింక్ లోపం

- తగిన యాజమాన్య పద్ధతులతోనే నివారణ
- వైరా కేవీకే కోఆర్డినేటర్ రవికుమార్ సూచనలు


జింక్ లోపించిన వరి పైరు

వైరా: జిల్లాలో ఈ వానాకాలం వరి 2.83 లక్షల ఎకరాల్లో సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో ఇప్పటివరకు సుమారు 1.40 లక్షల ఎకరాల్లో నాట్లు వేసినట్లు తెలుస్తోంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో వరి పైరులో జింక్ లోపాన్ని గుర్తించినట్లు వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ తెలిపారు. ఈమేరకు రైతులు సకాలంలో జింక్ లోపాన్ని గుర్తించి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆయన సూచించారు.

జింక్‌లోపం లక్షణాలు

వరి నాట్లు వేసిన రెండు రోజుల్లోనే జింక్ లోపం ఉంటే బయటపడుతుంది. జింక్ లోపించినప్పుడు ఆకు మొదలు భాగం, మధ్యలో ఈనె హరితం(ఆకు పచ్చ రంగు) కోల్పోయి ఆకులు పసుపు రంగులోకి మారతాయి. ఈ లక్షణాలు మూడు లేదా నాలుగు ఆకుల్లో స్పష్టంగా కనిపిస్తాయి. లేదంటే ముదురు ఆకుల్లో కనిపించవచ్చు. నల్ల నేలల్లో ఆకులు పసుపు రంగు, ఎర్ర నేలల్లో ముదురు ఆకులు తుప్పు పట్టినట్లుగా మారతాయి. ముదురు ఆకు చివర మధ్యలో తుప్పు రంగు, ముదురు ఇటుక రంగు కలిగి చిన్నచిన్న మచ్చలు కనిపిస్తాయి. జింక్ లోపం ఉన్న ఆకులు చిన్నవిగా నూలు కుండే ఆకారంలోకి మారతాయి. ఆకులు పలచగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. కొత్తగా వస్తున్న ఆకులు చిన్నవిగా ఉండి మొక్కలు, పిలకలు వేయడం తగ్గిపోతుంది. చౌడు భూములు, కొత్తగా సాగులోకి వచ్చిన భూముల్లో జింకు లోపం తీవ్రంగా ఉంటే 25 నుంచి 40 రోజుల వ్యవధిలో చాలా వరకు మొక్కలు చనిపోతాయి.

ఇవీ యాజమాన్య పద్ధతులు

నాట్లు వేసిన రెండు నుండి ఐదు వారాల మధ్యలో పైరుపై జింకు లోపాన్ని గుర్తిస్తే పొలం నుంచి పాత నీరు బయటకు పంపించి కొత్త నీరు పెట్టాలి. ప్రతీ మూడు పైర్లకు ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్‌ను నాటే ముందు వేస్తే జింక్ లోపాన్ని నివారించవచ్చు. జింక్ సల్ఫేట్‌ను ఆఖరు దమ్ముకు ముందుగా వేసి బాగా కలియదున్నాలి. ఇతర రసాయన ఎరువుల్లో భాస్వరం ఎరువుతో కలిపి జింక్ సల్ఫేట్ వేయొద్దు. అలా వేస్తే కాస్త గడువు ఇవ్వాలి. చౌడు భూముల్లోనైతే ఎకరాకు 40 కిలోల జింక్ సల్ఫేట్ వేయాలి. జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని లీటర్ నీటిలో రెండు గ్రాములు కలిపి వారం వ్యవధిలో రెండు, మూడు సార్లు పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

ఎంపీ, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ పార్థసారథిరెడ్డి


మాట్లాడుతున్న ఎంపీ, కళాశాల చైర్మన్ పార్థసారథిరెడ్డి

సత్తుపల్లిరూరల్: విద్యార్థి దశలోనే లక్ష్యాలను ఎంచుకుని కష్టపడి చదవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవాలని రాజ్యసభ సభ్యుడు, సాయిస్ఫూర్తి కళాశాల చైర్మన్ బండి పార్థసారథిరెడ్డి ఆకాంక్షించారు. సత్తుపల్లి మండలం గంగారంలోని సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా కళాశాల చైర్మన్ పార్థసారథిరెడ్డి బీ ఫార్మసీ కళాశాలకు నూతన భవనాలకు శంకుస్థాపన చేశాక స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో కష్టపడితే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. అనంతరం ఎంఎస్‌ఆర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి మట్లాడుతూ జ్ఞానాన్ని విద్యార్థులు ఆయుధంగా ఎంచుకునే గొప్పబలం అవుతుందన్నారు. మెరుగైన మార్కులతో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం అద్భుతమైన మైలురాయిగా ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రిన్సిపాల్ శేషారత్నకుమారి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జీఓ 28కి వ్యతిరేకంగా నిరసన

కలెక్టరేట్ వద్ద సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 28 తెలంగాణ సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీఎస్ సీపీఎస్ ఈయూ) జిల్లా అధ్యక్షుడు చంద్రకంటి శేఖర్ ఆరోపించారు. ఈమేరకు సీపీఎస్ ఉద్యోగులతో కలిసి కలెక్టరేట్ ఎదుట శుక్రవారం జీఓ ప్రతులను దహనం చేశాక ఆయన మాట్లాడారు. నూతన పెన్షన్ విధానాన్ని అమలుపరిచేలా బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2014 ఆగస్టు 23న జీఓను తీసుకొచ్చిందన్నారు. తద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులకు నష్టం కలుగుతోందని చెప్పారు. కాగా, ఎన్నికలకు ముందు ఇచ్చిన ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుత ప్రభుత్వం పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సీపీఎస్ ఉద్యోగుల ఆందోళనలకు టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బిక్కు మద్దతు తెలపగా అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. సీపీఎస్ ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారావుతో పాటు చర్ల శ్రీనివాసరావు, ఎం.శ్వేత, ఐ.భాను, కె.సంపత్, జిలాని, కె.ప్రసన్న కుమార్, ఎ.బంగారయ్య, అఫ్జల్, శంకర్, పవన్ పాల్గొన్నారు.

- తిరుమలాయపాలెం: జీఓ 28ప్రతులను తిరులాయపాలెంలో దహనం చేశారు. తిగుళ్ల శ్రీనివాసరావు ఎంపీఓ సూర్యనారాయణ, ఆర్‌ఐ లహరి, లక్ష్మణ్, మీరా, శారద తదితరులు పాల్గొన్నారు.

మెరుగు పెడతామని ఆరు తులాల బంగారంతో పరారీ


చోరీపై వివరాలు ఆరా తీస్తున్న సీఐ సంజీవ్, ఎస్సై జగదీష్

తిరుమలాయపాలెం: అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని పోలీసులు అవగాహన కల్పిస్తున్నా బాధితుల సంఖ్య తగ్గడం లేదు. ఇదే తరహాలో బంగారం మెరుగు పెడతామని వచ్చిన ఇద్దరి మాటలు నమ్మి ఆరు తులాల బంగారు గొలుసులు పోగొట్టుకున్న ఘటన మండలంలోని తాళ్లచెరువులో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చిగురుపాటి కోటయ్య భార్య లక్ష్మి, కోడలు సునీమా ఇంట్లో ఉండగా ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి బంగారం, వెండి ఆభరణాలకు మెరుగు పెడతామని నమ్మించారు. తొలుత వెండి పట్టీలకు మెరుగు పెట్టిన వారు ఆ తర్వాత మంగళసూత్రాలకు సైతం మెరుగు పెడతామని చెప్పగా లక్ష్మి, సునీమా తీసి ఇ చ్చారు. గుర్తుతెలియని వ్యక్తుల్లో ఒకరు ఆరు బయట ఉండగా మరో వ్యక్తి ఇంట్లోకి వెళ్లి గ్యాస్‌స్టౌ ఉన్న గిన్నెలో గొలుసులు వేస్తున్నట్లు నమ్మించి చల్లారక తీయాలని చెప్పి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత పాత్రలో పరిశీలించగా రెండు మంగళసూత్రాలు లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన మహిళలు లబోదిబోమన్నారు. ఈ నెల 28న ఇంట్లో శుభకార్యం ఉండడంతో ఆభరణాలకు మెరుగు పెట్టిస్తే కొత్తగా ఉంటాయనే భావనతో గుర్తుతెలియని వ్యక్తులను నమ్మి మోసపోయామంటూ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్‌ఐ కూచిపూడి జగదీష్ చేరుకుని వివరాలు ఆరా తీయడంతో దర్యాప్తు ప్రారంభించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నేలకొండపల్లి: రేషన్ బియ్యాన్ని లారీలో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని అప్పలనరసింహాపురం నుంచి శుక్రవారం తెల్లవారుజామున లారీలో బియ్యం తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 50 క్వింటాళ్ల మేర బియ్యం లారీని స్వాధీనం చేసుకున్నారు. కాగా, బియ్యం శాంపిళ్లను సివిల్ సప్లయీస్ అధికారులకు పంపించామని, నివేదిక వచ్చాక వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

కుటుంబంపై మూకుమ్మడి దాడి

నేలకొండపల్లి: ప్రహరీ నిర్మాణం విషయంలో జరిగిన పంచాయితీ కారణంగా ఓ కుటుంబం గురువారం అర్ధరాత్రి మూకుమ్మడి దాడి జరిగింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం అప్పలనరసింహాపురానికి చెందిన యలగాల కోటయ్య ప్రహరీ నిర్మిస్తుండగా గ్రామానికే చెందిన కొందరితో గొడవ జరగగా పెద్దలు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అయితే, కోటయ్య, ఆయన పద్మ, కుమారుడు శివపై గురువారం రాత్రి కొందరు దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఘటనపై బాధితులు గ్రామానికి చెందిన ఏడుగురిపై శుక్రవారం ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణ చేపట్టారు.

మత్స్యకారుడి మృతదేహం లభ్యం

వైరా: వైరా రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లి గల్లంతైన మృత్స్యకారుడి మృతదేహం శుక్రవా రం లభ్యమైంది. వైరా మున్సిపాలిటీ పరిధి హనుమాన్ బజార్‌కు చెందిన ఈర్ల రాములు (45) గురువారం ఉదయం చేపల వేటకు వెళ్లా డు. ఆ సమయాన ఈదురుగాలులు రావడంతో రాములు రిజర్వాయర్‌లో గల్లంతయ్యాడు. సహచర మత్స్యకారులు రాత్రి పొద్దుపోయే వరకు గాలించినా ఫలితం కానరాలేదు. చివరకు శుక్రవారం గజ ఈతగాళ్లు, మత్స్యకారులు గాలించడంతో రాములు మృతదేహం లభ్యమైంది. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు

పెనుబల్లి: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని నాయకులగూడెంకు చెందిన రాజిన్ని చెన్నారావు కిరాణం షాపు నడుపుతుండగా శుక్రవారం సాయంత్రం సామగ్రి కోసం మండలంలోని వీఎం బంజర్ వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈక్రమంలో సత్తుపల్లి జాతీయ రహదారిపై వీఎం బంజర్ సప్తపది ఫంక్షన్ హాల్ వద్ద ఆయనను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ గటనతో తీవ్రంగా గాయపడిన చెన్నారావును స్థానికులు పెనుబల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు.

సెల్ పాయింట్ దగ్ధం

కూసుమంచి: మండల కేంద్రంలోని వీబీఆర్ మొబైల్ షాపులో గురువారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరగగా పూర్తిగా కాలిపోయింది. ఈ ఘటనలో రూ.5లక్షల విలువైన సెల్‌ఫోన్లు ఇతర సామగ్రి కాలి బూడిదయ్యాయి. మండలంలోని లోక్యాతండాకు చెందిన దివ్యాంగుడైన వడిత్య రాంబాబు ఈ షాప్ నిర్వహణతో కుటుంబాన్ని పోషిస్తుండగా సర్వం కాలిపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపించాడు.

వృద్ధ మహిళ అదృశ్యం


నరసమ్మ

తల్లాడ: మండలంలోని మల్లవరానికి చెందిన పుసుపులేటి నరసమ్మ కానరాకుండా పోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లాడలోని ఆస్పత్రికి వెళ్తున్నానని ఈనెల 19న బయలుదేరిన ఆమె తిరిగి రాలేదు. ఎక్కడ గాలించినా ఆచూకీ లేకపోవడంతో నరసమ్మ కుటుంబ సభ్యులు శుక్రవారం చేసిన ఫిర్యాదుతో సు నమోదు చేశామని ఎస్‌ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

డెంగీతో వ్యక్తి మృతి


రామారావు (ఫైల్)

ఎర్రుపాలెం: మండలకేంద్రానికి చెందిన కంచర్ల రామారావు(47) డెంగీ బారిన పడగా మృతి చెందాడు. కొన్నాళ్లుగా ఆయన జ్వరంతో బాధపడుతుండగా చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు ఏపీలోని మంగళగిరి ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడే వైద్యం పొందుతూ రామారావు గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా, గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడం, చెత్తాచెదారం, వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలవడంతో దోమలు పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే, మండలంలోని బనిగండ్లపాడు ప్రభుత్వాస్పత్రిలో ఐదుగురు వైద్యులకు గాను ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో సరైన వైద్యం అందడం లేదని వాపోయారు.

చికిత్స పొందుతున్న యువకుడు...

నేలకొండపల్లి: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. నేలకొండపల్లి మండలం బోదులబండకు చెందిన ఉపేందర్ (35) గురువారం పొలం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం తెలియడంతో కుటుంబీకులు ఆయనను ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఉపేందర్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉండగా, ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

రెండు నెలల చిన్నారి మృతి

ఊపిరితిత్తుల్లోకి పాలు వెళ్లడంతో ఘటన

కారేపల్లి: పాలు తాగించే క్రమంలో ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో ఊపిరాడక రెండు నెలల చిన్నారి మృతి చెందింది. ఖమ్మం జిల్లా కారేపల్లికి చెందిన బాలరాజు స్థానికంగా వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నారు. ఆయన కుమారుడు వెంకటేశ్ భార్య రెండు నెలల క్రితం పుట్టినిల్లయిన మహబూబాబాద్‌లో ప్రసవించింది. అక్కడ కుమార్తెకు శుక్రవారం పాలు తాగించే క్రమంలో ప్రమాదవశాత్తు ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో ఊపిరాడక మృతి చెందింది. దీంతో చిన్నారి మృతదేహాన్ని కారేపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. రెండు నెలలకే నూరేళ్లు నిండాయా తల్లీ అంటూ కుటుంబీకులు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

వివాహ వేడుకలో ఘర్షణ.. నలుగురికి గాయాలు

బోనకల్: వివాహ వేడుకలో యువకుల వీరంగంతో నలుగురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చిరునోములలో శుక్రవారం చోటుచేసుకుంది. చిరునోముల గ్రామానికి చెందిన ఓ యువకుడికి ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండలం సింగారానికి యువతితో శుక్రవారం వరుడి ఇంటి వద్ద వివాహం జరిగింది. ఈక్రమంలో వధువు తరఫున బంధువుల్లో కొందరు యువతులు భోజనం చేస్తున్న క్రమంలో చిరునోములకు చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో వారి వద్దకు వెళ్లి పదేపదే చికెన్ వేయించుకుంటారా అంటూ వేధించారు. దీంతో యువతుల బంధువులు ఇదేమిటని మందలించడంతో మద్యం మత్తులో యువకులు వధువు తరఫు వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో వధువు బంధువులు ఇద్దరితో పాటు భోజనానికి చేస్తున్న గ్రామస్తులు ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసిన పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు నచ్చచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యాసంస్థల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల తనిఖీ


కూసుమంచి కేజీబీవీలో సరుకుల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంరూరల్/కూసుమంచి/తిరుమలాయపాలెం/నేలకొండపల్లి: పౌర సరఫరాల శాఖకు సంబంధించి రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లు, హాస్టళ్లలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. తిరుమలాయపాలెం, కూసుమంచి, నేలకొండపల్లి, ఖమ్మం రూరల్, ముదిగొండ మండలాల్లో 30కి పైగా విద్యాసంస్థల్లో తనిఖీ చేసి బియ్యం నాణ్యత, సామగ్రి వివరాలపై ఆరా తీశారు. కూసుమంచి మండలంలోని కేజీబీవీలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలతతో కలిసి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీధర్‌రెడ్డి, అంజయ్య తనిఖీ చేయగా బియ్యం, కోడిగుడ్లు, ఇతర సరుకుల నాణ్యతతో పాటు వసతి గదులు, వంట గదిని పరిశీలించారు. అలాగే, విద్యార్థులతో మాట్లాడి మెనూ అమలుపై ఆరా తీసి ఎస్‌ఓ అజితకుమారి ద్వారా వివరాలు సేకరించారు. అలాగే, రావిచెట్టు తండాలోని అంగన్‌వాడీ కేంద్రం, తిరుమలాయపాలెం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలతో పాటు నేలకొండపల్లి మండలంలోని రాజేశ్వరపురం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ సైతం పాల్గొన్నారు.